ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023
5
కర్నూలు



# పత్తికొండలో ఇన్‌ఛార్జీ పాలనే దిక్కు

**- ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ఇన్‌ఛార్జీలే - రెగ్యులర్ అధికారులు లేక అభివృద్ధి కుంటు**

**ప్రజాశక్తి- పత్తికొండ**

పత్తికొండ రెవిన్యూ డివిజన్ ఏర్పడి 22 నెలలు పూర్తయింది. ఇప్పటివరకు ప్రధాన ప్రభుత్వ కార్యాలయంలో ఇన్‌ఛార్జి అధికారుల పాలన కొనసాగుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించాలని ఉద్దేశంతోనే పత్తికొండ, తుగ్గలి,మద్దికేర ,దేవనకొండ ఆస్పరి హాలహర్వి, దేవనకొండ, ఆలూరు, చిప్పగిరి క్రిష్ణగిరి మండలాలను కలుపుకొని పత్తికొండను నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. డివిజన్ కేంద్రం పత్తికొండలో పత్తికొండ తహశీల్దార్ , మేజర్ గ్రామపంచాయతీ, హౌసింగ్ కార్యాలయం, ఎపిఎస్ఆర్‌టిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కార్యాలయంలో ఇన్‌ఛార్జి అధికారుల పాలను కొనసాగుతుంది. రెగ్యులర్ వారు లేకపోవడంతో ఆ కార్యాలయంలో కార్యకలాపాలను కుంట పడుతున్నాయని పట్టణ గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రధాన సమస్యల అడిగితే దానిని పరిష్కరించలేమని, 'మేము రెగ్యులర్ కాదు ఇంచార్జ్ మాత్రమే ' అని బహిర్గతంగానే ప్రజలకు అధికారులు చెబుతున్నారు. చేసేది ఏమీ లేక కొందరు ప్రజలు వెను తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జగనన్న సురక్ష పథకాన్ని ఎలా అమలు చేస్తారని పట్టణ గ్రామీణ ప్రజలు విమర్శలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోని ఇంచార్జ్ పాలన కొనసాగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

పత్తికొండ తహశీల్దార్‌గా 2022లో శివరామకృష్ణ బాధ్యతలు తీసుకొని రెండు నెలలు గడవక ముందే కల్లూరు మండలానికి బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న విష్ణు ప్రసాద్ తహశీల్దార్ ఇన్చార్జిగా కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకే డిప్యూటీ కలెక్టర్‌గా మనోజ్ రెడ్డి ఆరు వారాలపాటు పత్తికొండలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న కృష్ణ కుమార్ 2021లో ఆలూరు కు బదిలీ అయ్యారు. వెల్దుర్తిలో ఇఒఆర్‌డి గా పనిచేస్తున్న నరసింహులను పత్తికొండ ఇంచార్జ్ ఇఒగా బాధ్యతలు చేపట్టారు. వారానికి మూడు రోజులు మాత్రమే పత్తికొండకు వస్తూ పోతూ ఉంటారు. పత్తికొండమేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతున్నా పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావడంతో దోమలు బెడద ఎక్కువగా ఉంది. దోమలు ద్వారా రోగాల భారీ పడే అవకాశం ఉంది.బ్లీచింగ్ పౌడర్, దోమల మందు స్ప్రే చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2020లో ప్రిన్సిపల్ జమీర్ బాష కర్నూలు డివిఇఒ గా బదిలీపై వెళ్లారు. ఇన్చార్జి ప్రిన్సిపల్‌గా రామలింగడు కొనసాగుతున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపల్ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయానికి లెక్చలర్లు రావడం లేదని విద్యార్థి సంఘ నాయకులు పలుమార్లు తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించి రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరారు. సబ్ డివిజన్ గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికేర, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలకు సంబంధించిన డిఇ గురు ప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా పొద్దుటూరుకు వెళ్లారు. తుగ్గలి ఎఇ విజయ్ కుమార్‌ను పత్తికొండ ఇంచార్జ్ డిఇగా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ రాజ్ కార్యాలయంలో తుగ్గలి ఎఇగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లను పత్తికొండ ఇంచార్జ్ పంచాయతీరాజ్ ఎఇగా అదనపు బాధ్యతలతో కొనసాగిస్తున్నారు. పత్తికొండ ఆర్‌టిసి డిపో డిఎంగా ఆదోని డిఎంగా మహమ్మద్ రఫీ ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఆయన పత్తికొండకు వారానికి రెండుసార్లు మాత్రమే వస్తూ వెళు _న్నారు. పత్తికొండ నుంచి సుదూర ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రయాణం కొనసాగుతుంది. హైదరాబాద్, బెంగళూరు, అనంతపురం, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు బస్సులు నడుపుతుంటారు. అసౌకర్యాలతో ఆర్‌టిసి ప్రాంగణం ఉంది.



**రెగ్యులర్ అధికారులను నియమించాలి: సిపిఎం**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌ఛార్జి పాలన కొనసాగడంతో పత్తికొండ అభివృద్ధి జరగడం లేదని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు పేద ప్రజలు కార్యకలాపాలకు వస్తే పనులు జరగక తిరిగి ఇంటికి వెళ్తున్నారు. పలుమార్లు ప్రజలు మా దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ పాలన కొనసాగించాలని కోరారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేయబడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఉత్పాదక రంగం ద్వారా అభివృద్ధి సాధ్యం

**- జెఎన్‌టియు వైస్ ఛాన్సిలర్ రంగజనార్ధన**
**- రవీంద్రలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే**
**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

దేశ అభివృద్ధి ఉత్పాదక రంగం ద్వారానే సాధ్యమవుతుందని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ జి. రంగ జనార్ధన పేర్కొన్నారు. సోమవారం కర్నూలు శివార్లలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలకు జెఎన్‌టియు విసి జి. రంగజనార్ధన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్నాతకోపన్యాసంలో ముందుగా ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకుంటున్న విద్యార్థులను అభినందిస్తూ వారికి దిశ నిర్దేశం చేశారు. దేశ భవిష్యత్తు ఆర్థిక రంగంపై ఉందని, యువత కేవలం సేవారంగంపై మొగ్గుచూపుక ఉత్పాదక రంగంవైపు అడుగులు వేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్న దేశాలైన తైవాన్ దక్షిణ కొరియా వంటివి ఆర్థికంగా నిలదొక్కుకున్నాయంటే ఆయా దేశాలు ఉత్పాదకరంగంలో సాధించిన అభివృద్ధే కారణమని అన్నారు. అనంతరం కళాశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలోని తమ కళాశాల పెద్ద నగరంలోని డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు ధీటుగా ప్లేస్‌మెంట్స్ సాధిస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు గట్టి భరోసా ఇస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థులు చదువుకుంటూనే సంపాదన వైపు దృష్టి పెట్టినట్లయితే ఆ విద్యార్థి లేదా విద్యార్థిని జీవితంలో రాణిస్తారన్నారు. పాశ్చాత్య దేశాల్లో ఉన్న ఈ సంస్కృతి మనదేశంలో కూడా రావాలని అభిలాషించారు. రానున్న రోజుల్లో భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని, దీనికి మూల కారణం యువభారతమే అని అన్నారు. పట్టభద్రులైన ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు గర్వపడేలా, జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశం గుర్తించేలా ప్రవర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రాంచీల వారిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి బంగారు పథకాలను ప్రదానం చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ జివిఎం. మోహన్ కుమార్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 489 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు పుచ్చుకుంటున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై.పాండురంగయ్య, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎం. గిరిధర్ కుమార్ ,డీన్లు , వివిధ శాఖాధిపతులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌టియు వైస్ ఛాన్సిలర్ రంగజనార్ధన

# నన్నూరు పుట్ వే బ్రిడ్జి పనులను ఆపాలి

**- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ**
**- కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామ సమీపంలో పుట్ వే బ్రిడ్జి పనులను వెంటనే ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పుట్‌వే బ్రిడ్జి పనులు తక్షణమే నిలిపివేయాలని ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షత వహించారు. జి.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్షులు జి.శ్రీధర్, రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి ఎస్ మధుసూదన్ మాట్లాడారు. జాతీయ రహదారిపైన ఫ్లై ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. రహదారిపై అనేకమంది ప్రాణాలు కోల్పోయారని, ఈ గ్రామాన్ని ఆనుకొని లొద్దిపల్లె, మీదివేముల, బైరాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కలుగొట్ల, బుక్కాపురం గ్రామాల ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి పనుల నిమిత్తం వందలాది మంది వెళు తుంటారన్నారు. వారందరూ తమ గ్రామాలకు తిరిగి వచ్చేదాకా ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సి ఉందన్నారు. ఏ వాహనం ఎటు నుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నన్నూరు గ్రామ విద్యార్థులు వందలాదిమంది హైస్కూలు అవతల వైపు ఉండడంతో రోడ్డు దాటుతూ వస్తూ ఉండాలని, వీరి తల్లిదండ్రులు విద్యార్థులకు బడి అయిపోయి ఇంటికి వచ్చేదాకా ఆందోళన చెందుతున్నారన్నారు. గతంలో అనేకసార్లు హైవే అథారిటీ, తహశీల్దార్, కలెక్టర్ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు. రూ. కోటి 30 లక్షలు ఖర్చు చేసి ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన ఉపయోగం లేదన్నారు. పనులు ప్రారంభించిన తర్వాత గత నెల 27 నుండి గ్రామ ప్రజలు, విద్యార్థులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెండుసార్లు పనులు బంద్ చేసి ఒక్కరోజు సామూహిక దీక్షలు చేపట్టామని, కలెక్టర్‌కు స్పందనలో వినతి పత్రం ఇచ్చామన్నారు. కలెక్టర్, ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, జోక్యం చేసుకొని పుట్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపివేసి హైవే పైన ఫ్లైఓవర్ బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పుట్‌వే బ్రిడ్జి పనులు నిలిపివేసి ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరిని కూడగట్టి పనులను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ధర్నా వద్దకు డిఆర్ఓ వచ్చి వినతి పత్రం స్వీకరించారు. ఈసమస్య పరిష్కారానికి కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు విన్నవించారు. పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నన్నూరు గ్రామ ప్రజలు మల్లేష్, సలాబాష ఆంజనేయులు, సంజీవ, దస్తగిరి, దానమయ్య, సిద్దయ్య, బొజ్జన్న, రోశన్న , వెంకటేశ్వర్లు, మధు, స్వాములు, విజయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు

# పాఠ్య పుస్తకాలిచ్చేవరకు పోరాటం

**- కలెక్టరేట్ ఎదుట ధర్నా**
**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇచ్చేంతవరకు పోరాటం ఆగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా హెచ్చరించారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కెవిఆర్ , టౌన్ మోడల్ కాలేజ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడంతో అక్కడికి డిఆర్ఒ నాగేశ్వరావు విచ్చేసి ఎస్ఎఫ్ఐ నాయకులు నుండి వినతిపత్రాన్ని స్వీకరించారు. నగర కార్యదర్శి సాయి అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి అబ్దుల్లా మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కెజి నుండి పిజి దాకా ఉచిత విద్య అందిస్తాననేసి మాట చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడు సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేసే విధంగాప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేసిన సందర్భంగా విద్యాశాఖ మంత్రి వచ్చే విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలు సకాలంలో అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కళాశాలలు ప్రారంభమై నెల కావస్తున్నా ఇంతవరకు పుస్తకాలు అందలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు వెంటనే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2500 లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో చలో విజయవాడకు పిలుపుని స్తామని హెచ్చరించారు. సిటీ అధ్యక్షులు అమర్, మండల కార్యదర్శి అంజి, సిటీ ఉపాధ్యక్ష కార్యదర్శులు నరసింహా, అబ్బు భాస్కరు, మల్లేష్, యోగి, తేజ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

# లా నేస్తం ద్వారా ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

జిల్లాలో వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా 128 మంది జూనియర్ న్యాయవాదు లకు రూ.23,15,000 బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ లా నేస్తం ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా న్యాయ విద్య పూర్తి చేసిన యువ లాయర్లు వృత్తిలో నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే సదుద్దేశంతో అక్టోబరు 2019 నుండి ఈ పథకం ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన న్యాయవాదులకు ప్రభుత్వం నెలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తూ వారికి చేయూతనిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ యువ న్యాయవాదులకు ప్రభుత్వం అండగా ఉంటూ వైఎస్ఆర్ లానేస్తం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. న్యాయవాదుల అవసరాలకు రుణాలు, గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీలు, ఇతర అవసరాల కోసం ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే రూ.25 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించిందని తెలిపారు. అనంతరం అతిథులు రూ.23.15 లక్షల మెగా చెక్కును జూనియర్ న్యాయవాదులకు అందించారు. జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి, సీనియర్ న్యాయవాది సత్యనారాయణమ్మ, న్యాయ వాది అర్సియా పర్వీన్, డిఎల్‌డిఒ బాలకృష్ణ, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


కిక్కు బ్యాగులు, పంచింగ్ ప్యాడ్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డాక్టర్ శంకర్‌శర్మ

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. డాక్టర్ శంకర్‌శర్మ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం గాయత్రి ఎస్టేట్‌లోని క్లినిక్‌లో నగరంలో టైక్వాండో క్రీడాకారుల సాధన చేసినందుకు కిక్కు బ్యాగులు, పంచింగ్ ప్యాడ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అందుకే ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు పేద విద్యార్థులకు ఆడాలన్నారు. క్రీడలు ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు తోడ్పడుతాయన్నారు. సెల్ఫోన్లు, టీవీలు తమ పిల్లలకి దూరం ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. మాస్టర్ టి వెంకటేశ్వర్లుకు కిక్ బ్యాగులు డాక్టర్ శంకర్‌శర్మ అందజేశారు.

## వైద్యాధికారిగా డాక్టర్ ప్రతిమ

**ప్రజాశక్తి-తుగ్గలి**

తుగ్గలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారిగా డాక్టర్ జి. ప్రతిమను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు.గతంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్య అధికారిని డాక్టర్ దాక్షాయని సాధారణ బదిలీల్లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. దీంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటి మండలం, మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారినిగా పనిచేస్తున్న డాక్టర్ జి.ప్రతిమను సాధారణ బదిలీల్లో తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నియమించారు. దీంతో సోమవారం డాక్టర్ జి.ప్రతిమ కర్నూలు డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకున్నారు. అనంతరం తుగ్గలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ (డిడిఒ) ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ జి.ప్రతిమకు వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.



# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**పలు ప్రాంతాల్లో యాంటీ డ్రగ్స్‌డే పై అవగాహన సదస్సులు, ర్యాలీలు**
**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీసులు పలు ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారని తెలిపారు. ఇప్పటివరకు 74 కళాశాలల వద్ద హోర్డింగ్స్, పోస్టర్లు ఏర్పాటు చేశారని, 20 కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారని, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, కోసిగిలలో 7 ర్యాలీలు నిర్వహించా రన్నారు. భారత ప్రభుత్వం నిషాముక్తి భారత్, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వం https:pledge.mygov.in నందు ఈ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ తీసుకోవాలని యువతకు, ప్రజలకు పిలుపుని ఇచ్చింది. సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్, కెవి సుబ్బా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్‌డే పై అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారని అన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వారిపై, వినియోగించే వారిపై నిఘా ఉంచి పలువురిపై పోలీసు , సెబ్ అధికారులు కేసులు నమోదు చేశారన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి మాదకద్రవ్యాలు ఉన్నట్లు ఖచ్చితమైన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇచ్చినా వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్‌పి తెలిపారు.



**పత్తికొండ :** డ్రగ్స్‌కు యువత బానిస కావద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పత్తికొండ డిఎస్‌పి పి.శ్రీనివాసరెడ్డి యువతకు సూచించారు. పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి ,పత్తికొండ సిఐ మురళీమోహన్ మాట్లాడారు. డ్రగ్స్ వాడకం సంతోషంతో మొదలై దుఃఖంతోనే అంతమవుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అనునిత్యం దృష్టి పెట్టాలని, ప్రవర్తనలో మార్పులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గ నిర్దేశం చేయాలని సూచించారు.నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ 1985 ప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో జిపి.విజయ్ కుమార్ , పత్తికొండ ఎస్ఐ సి.వెంకటేశ్వర్లు , ఎస్ఎండి జఫ్రుల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థ పానెల్ అడ్వకేట్స్ , ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.సుబ్బయ్య పాల్గొన్నారు.

**సి బెళగల్ :** మత్తు పానీయాలను, పదార్థాలను అలవాటు చేసుకోవడం వలన జీవితాలు చిత్తు కాక తప్పదని ఎస్ఐ పీరయ్య పేర్కొన్నారు. మోడల్ స్కూల్లో ప్రిన్సిల్ వంశీ మోహన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని మత్తుకు దగ్గరైతే దేశం అథోగతి అని అన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్**
**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు వారి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆ సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ వేడుక కర్నూలుం కెమిస్ట్రీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఎంజెఎఫ్ లయన్ ఎవిఆర్ ప్రసాద్, ఎంజెఎఫ్ లయన్ నాగేశ్వర్‌రావు , గవర్నర్ లయన్ డాక్టర్ బాలమద్దయ్య, పాస్ట్ గవర్నర్, ప్రెసిడెంట్ లయన్ దామెర ప్రభాకర్, సెక్రటరీ లయన్ లోకేష్, ట్రెసరర్ లయన్ శ్రీకాంత్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వారు సంవత్సర కాలంపాటు పదవులలో కొనసాగుతారన్నారు. ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ కరోనా కష్టకాలంలో చేసిన సేవలను వారు గుర్తు చేస్తూ శాలువా బొకేలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా గుర్తించి సమాజంలో ప్రతి ఒక్కరు తమకు ఉన్న దాంట్లో కొంత బీదవారికి సహాయం చేయాలని సూచించారు. పేద మహిళలకు చీరల పంపిణీ చేసారు. లయన్స్ మెంబర్స్ ఎన్‌వి.రామరాజు, బివి రమణ గౌడ్, శీరం గౌడ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, క్లబ్బు సభ్యులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, లైన్స్ క్లబ్ నిర్వహికులు గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య, ఎంజెఎఫ్ లయన్ ఎవిఆర్ ప్రసాద్, లయన్ నాగేశ్వర్‌రావు, తదితరులు


జిజిహెచ్ ఆవరణలో మెడికల్ షాపులను మూయిస్తున్న వైద్యాధికారులు

## జిజిహెచ్ ఆవరణలోని రెండు మెడికల్ షాపులు సీజ్

**ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న రెండు మెడికల్ షాపులను సీజ్ చేయాలని జిజిహెచ్ సూపరింటెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో ఉన్న రెండు జన్రిక్ మెడికల్ షాపులో మందులను అధిక రేట్లకు అమ్ముతున్నారని, మందులకు సంబంధించిన బిల్లులు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వానికి టాక్స్, ఆసుపత్రికి (హెచ్‌డిఎస్) రావలసినవాటా, వారికి వచ్చిన ప్రాఫిట్‌లోషేర్, షాపుల రెంట్లు పే చేయడం లేదు అన్నారు. షాపులకు ఇచ్చిన కాలపరిమితి ముగిసినదని నోటీసులు జారీచేసినా పట్టించుకోకుండా వాళ్ల అనధికారికంగా షాపులను కొనసాగిస్తున్నారని అన్నారు. ఆసుపత్రి మెడికల్ షాపులకు ఇచ్చిన పర్మిషన్స్ ప్రకారం జనరిక్ మెడిసిన్స్ మాత్రమే అమ్మాలని, అలాంటిది వారు సర్జరీ , ల్యాబ్‌కు సంబంధించిన మందులను కూడా అమ్ముతున్నారని తెలిపారు. ఈరోజు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెండు మెడికల్ షాపులను సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

## టిడిపి మేనిఫెస్టోను వివరించాలి : గౌరు చరిత

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రతి ఇంటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజలకు భరోసా ఇవ్వాలని టిడిపి పాణ్యం ఇన్చార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. సోమవారం వారి నివాసంలో గౌరు చరిత వెంకటరెడ్డి దంపతులు ఓర్వకల్లు మండల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం ప్రతి ఇంటికి చేరవేసేలా మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకెళ్ళి, ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, మండల అధ్యక్షుడు గోవింద రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల నాయకులు విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణపల్లె నాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి,రామ భూపాల్‌రెడ్డి, నన్నూరు ఖాజామియ, విజయుడు, శేఖర్, రంగ స్వామి,రామ సుబ్బా రెడ్డి, ఉప్పల పాడు సర్పంచ్ అయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయింపు**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బల్లేకల్ గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొందని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. చాలా వీధుల్లో సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని తెలిపారు. సోమవారం సిఐటియు, వ్యకాస, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోని, మాధవరం రోడ్డుపై గంటసేపు బైఠాయించి, రాస్తారోకో చేపట్టారు. ఆటో యూనియన్ మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శ్రీకృష్ణ మాట్లాడారు. ఏడాది క్రితం సచివాలయాన్ని ముట్టడించినప్పటికీ సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. నేటికీ సమస్యను పరిష్కరించడం లేదని చెప్పారు. ఎన్నోసార్లు ఆందోళన చేసినా ఫలితం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపైకి వచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకుని తాగునీరందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనలకు ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆటో యూనియన్ నాయకులు ఉరుకుందు, వీరేష్, నాగార్జున, డివైఎఫ్ఐ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## భాష్యం విద్యార్థుల సంబరాలు

**ప్రజాశక్తి - ఆదోని**


ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

పట్టణంలోని భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి భాష్యం స్కూల్ నుంచి టూ టౌన్ పోలీసు స్టేషన్ మీదుగా భాష్యం-2 బ్రాంచి విద్యార్థులు మోర్ మార్కెట్, వైఎస్ఆర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్స్ సురేంద్రబాబు, సదాశివ మాట్లాడారు. భాష్యం విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో అఖిల భారత స్థాయి ఓపెన్ కేటగిరిలో టాప్-10 ర్యాంకుల్లో ప్రతిభ కనబరిచారన్నారు. 5వ ర్యాంకు సాధించిన ఎవి.శివరాం, 10వ ర్యాంకు సాధించిన వైవి.మణిందర్ రెడ్డిలు అత్యుత్తమ ర్యాంకులు సాధించి చరిత్రను తిరగరాశారని కొనియాడారు. భాష్యం విద్యాసంస్థల్లో అధినేత భాష్యం ఛైర్మన్ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు సహాయ, సహకారాలను అందిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపల్ భార్గవ్, అంజి, ప్రధానోపాధ్యాయులు శిరీష, వాణి, ఉపాధ్యాయులు మాధవ్, పరశురాం, ఫ్రాన్సిస్, షేక్షావలీ, శంకర్, వీరేష్, ఈరమ్మ, మహబూబ్ బాష ఉన్నారు.

## వైసిపితో విద్యావ్యవస్థ నాశనం : టిడిపి

**ప్రజాశక్తి - నందవరం**

విద్యా వ్యవస్థను సర్వ నాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసమర్థ, అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రంలోని విద్యార్థులు విద్యను కొనసాగించలేకపోతున్నా టిడిపి మండల యువ నాయకులు గురురాజ్ దేశాయి తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఫీజెక్కడ కంస (జగన్) మామా' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు ఫీజులు కట్టుకోలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ, మధ్యలో విద్యకు దూరమవుతున్నా కనికరం లేకుండా పథకాల్లో కోతలు పెడుతున్నారని విమర్శించారు. ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసేలా తెచ్చిన జిఒలను వెనక్కి తీసుకోవాలని కోరారు. జిఒ 71ను రద్దు చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలని డిమాండ్ చేశారు. అలాగే హాస్టల్‌లో వసతులు, సొంత భవనాలు, మెస్ అండ్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. టిఎన్ఎస్ఎఫ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూలు

**గోనెగండ్ల :** మండలంలోని మూడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటరీ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపిడిఒ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పెద్దనేలటూరు పంచాయతీలో ఖాళీగా ఉన్న 3, గోనెగండ్ల 1, వెముగోడు 1 మొత్తం 5 వాలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఎఒ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి తాటికొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలి

**- అర్హత ఉన్న ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు**

**ప్రజాశక్తి - దేవనకొండ**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీతనంతో పని చేసి, అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెల్లెల చెలిమల, బంటుపల్లి గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముందుగా చెల్లెల చెలిమల గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సచివాలయ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయం మంజూరు కావడంతో భూమి పూజ చేసి ప్రారంభించారు. జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగా ప్రతి అధికారి, వాలంటీర్ ప్రతి ఇంటినీ సందదర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరామ్

గ్రామంలో ఇంటింటిని దర్శించి ప్రభుత్వం చేసిన సంక్షేమం గురించి వివరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే, వారి వివరాలు సేకరించి పథకాలందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు, వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంపిడిఒ గౌరీ దేవి, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, జడ్‌పిటిసి రామకృష్ణ, ఎంపిపి భర్త ఉమాంబ, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, నాయకులు ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రేమనాథ్ రెడ్డి, మద్దిలేటి నాయుడు, దివాకర్ నాయుడు, నారాయణరెడ్డి, రామచంద్ర, పల్లెదొడ్డి చంద్ర, కొత్తపేట బాబు, నారాయణ, బంటుపల్లి సర్పంచి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## గుత్తేదారులు, వక్ఫ్ బోర్డు అధికారులు కుమ్మక్కు

**- రూ.కోట్లు దోపిడీ చేశారు : గ్రామస్తులు**

**- కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్న భక్తులు**

**ప్రజాశక్తి - హోళగుంద**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎల్లార్తి షేక్షావలీ దర్గాలో గుత్తేదారులు, ఒక వక్ఫ్‌బోర్డు అధికారి కుమ్మక్కై రూ.కోట్లు దోపిడీ చేశారంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక భక్తులు అల్లాడుతుంటే పదేళ్లుగా మల్లికార్జున అనే వ్యక్తి వక్ఫ్ బోర్డు అధికారులతో కుమ్మక్కై టెండర్ దక్కించుకున్నానంటూ ఒక్కో దానికి ఒక్కో ధర పెట్టి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్వామి వారి పేటిట జంతు బలిదానం చేసేందుకు రూ.1100, టెంకాయ కొట్టడానికి రూ.100, మట్టి కాయలు రూ.500, తాయితాలు రూ.150, దర్గాకు వచ్చిన భక్తులకు రూ.50 ఇవ్వాల్సిన వసతి గదులను రూ.500కు పెంచి ఇలా ప్రతిదాంట్లో భక్తులను నిలువు దోపిడీ చేసి సొమ్ము తీసుకుంటున్నట్లు విమర్శిస్తున్నారు. విరాళాలు, హుండీ డబ్బులు పక్కదారి పట్టినట్లు పేర్కొంటున్నారు. దర్గాకు ఏడాదికి రూ.2 కోట్ల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. వచ్చిన సొమ్ము దర్గా అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం ఖర్చు చేయకుండా కొందరి జేబుల్లోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ జరిగే దోపిడీ ప్రతి ఒక్కరికీ తెలిసినా 'మాకెందుకులే' అని నోరు మెదుపలేకపోతున్నారని పేర్కొంటున్నారు. కలెక్టర్ స్పందించి షాషావలీ, షేక్షావలీ దర్గాలో జరుగుతున్న అవినీతిపై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లార్తి గ్రామస్తులు

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలివ్వాలి

**- తహశీల్దార్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ నిరసన**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమని, వెంటనే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఇంటర్ విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ ఎజాజ్ అహ్మద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలను కూడా ప్రయివేట్ పరం చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. పాఠ్యపుస్తకాలు కొనుక్కుని కళాశాలకు రావాలని, పాఠ్యపుస్తకాలు ఇవ్వబోమని ప్రభుత్వం నిర్లక్ష్యంగా చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కృపానందం, మోహన్, వినోద్, శివలింగ పాల్గొన్నారు. **ఆలూరు** కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి నినాదాలతో ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పోతురాజు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ధనంజయ్, రషీద్, విష్ణుకుమార్, నాయక్ పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న నాయకులు

## సత్యనారాయణ రెడ్డికి తిక్కారెడ్డి పరామర్శ

**మంత్రాలయం :** అనారోగ్యంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మాలపల్లి సత్యనారాయణ రెడ్డి అనారోగ్యంతో కర్నూలులోని అమృత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి ఆస్పత్రికి వెళ్లి సత్యనారాయణ రెడ్డిని పరామర్శించి, ఆరోగ్య విషయంపై అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అవసరమైనా తనకు తెలపాలని కోరారు.

## రాష్ట్రంలో అధికార మార్పు తథ్యం

**- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు**

**ప్రజాశక్తి - ఆదోని**



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు విసుగెత్తిపోయారని, వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదల భవిష్యత్తే లక్ష్యంగా టిడిపి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో వల్ల ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత మొదలైందని, రాష్ట్రంలో అధికారం మారడం తథ్యమని తెలిపారు. టిడిపి చేపట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్ర' వచ్చే కొద్ది రోజుల్లో ఆదోని నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా ఈనెల 30న ఉదయం 10 గంటలకు టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు హాజరు కావాలని కోరారు.

## నకిలీలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టిడిపి

**ప్రజాశక్తి - ఆదోని**

గతేడాది నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారమందించి ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకులు మదిరె భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో గతేడాది సుమారు 23,180 హెక్టార్లలో పత్తి సాగు చేసి నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయారని తెలిపారు. పంట ఏపుగా పెరిగి దిగుబడి రాక నష్టపోయారని చెప్పారు. ఈ విషయాన్ని అప్పట్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి, సంబంధిత డీలర్లకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. శాస్త్రవేత్తలు వచ్చి పంటను పరిశీలించినా పైసా పరిహారం రాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రామస్వామి, సోమశేఖర్ రెడ్డి, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, మాజీ సర్పంచి కారుమంచప్ప, నారాయణపురం షేక్షావలీ, సాధిక్ వలీ, శివయ్య స్వామి, వాల్మీకి నగర్ రాముడు, మల్లేష్, వైపి.భరత్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 'మెరుగైన విద్యనందించండి'

**చిప్పగిరి :** కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బాలికలకు ప్రభుత్వం అన్ని వసతులను ఏర్పాటు చేసిందని, వారికి మెరుగైన విద్యనందించడమే ఉపాధ్యాయుల ఏకైక లక్ష్యమని ఎంఇఒ-2 బాలనాయుడు సిబ్బందికి సూచించారు. సోమవారం చిప్పగిరి కెజిబివి పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లను, టీచర్ల బోధన, భోజన వసతిపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుపై ఎక్కువ దృష్టి పెట్టి వంద శాతం ఫలితాలు చూపించాలని బాలికలను కోరారు. సైన్స్ పరికరాలు ఉపయోగించుకోవడానికి ప్రత్యేక రూములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ అరుణాదేవి పాల్గొన్నారు.


# వివాదాలకు దారితీస్తున్న 'రీ సర్వే'

**- నాయకులకు కొమ్ముకాస్తున్న సచివాలయ సర్వేలు**

**- వారు పెట్టిన రాయే ఫైనల్ అంటూ భారీగా వసూలు**

**ప్రజాశకి - ఎమ్మిగనూరు రూరల్**

మండలంలో ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో రైతులకు అనేక సమస్యలు వచ్చి పడుతున్నాయి. ఒకవైపు రీ సర్వే ఉచితమని చెబుతూనే మరో వైపు సర్వేయర్లు, విఆర్ఒలు రూ.వేలకు వేలు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సచివాలయ ఉద్యోగులు తమ దత్తపుత్రులు అంటూ అధికార పార్టీ నాయకులు ఇష్టమొచ్చినట్లు సర్వేయర్లను, విఆర్ఒలను వాడుకొని పేద, ధనిక రైతులని చూడకుండా అధికార పార్టీ నాయకులు తమ మాట వినకుంటే చాలు సమస్యలను సృష్టించి విఆర్ఒ, సర్వేయర్లు, పోలీసుల ద్వారా ఆ రైతులను ఇబ్బంది పెట్టి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. మండలంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి పార్లపల్లి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 172లో నాలుగు ఎకరాల పొలం కొన్నారు. రిజిస్టర్ కూడా చేయించుకున్నారు. కొన్నప్పటి నుంచి అనుభవంలోనే ఉన్నారు. రీ సర్వే చేసినప్పుడు 30 సెంట్లు తక్కువగా ఉంది. తనకున్న రికార్డు ప్రకారం 30 సెంట్లు రావాలని మండల సర్వేయర్‌కు సర్వే చేయమని అర్జీ పెట్టుకున్నా 'అప్పుడు, ఇప్పుడు' అని కాలయాపన చేస్తున్నారు. గ్రామ సర్వేయర్ 30 సెంట్లు వదలాల్సిన వాళ్ల దగ్గర నుంచి రూ.40 వేలు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బనవాసి గ్రామంలో విలేజ్ సర్వేయర్ రైతులతో ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటున్నట్లు పలువురు రైతులు విమర్శిస్తున్నారు. పొలాల పక్కన రైతులకు ఒక్కొక్కరికి ఒక్కో మాట చెప్పి వివాదాలకు కారణమవుతున్నారు. రైతులు అదీ, ఇది అని మాట్లాడేలోపు అదే సర్వేయర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లమని ఉచిత సలహా ఇస్తున్నట్లు సమాచారం. పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరడం ఆ పంచాయితీలో అధికార పార్టీ నాయకులు ఎలా చెబితే అలా పోలీసులు విని రైతులను మోసం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయం జరగడం లేదని గట్టిగా అడిగితే 'వైసిపి నాయకులతో ఫోన్ చేయించు' అని దబాయిస్తున్నట్లు తెలిసింది. అలాగే బనవాసి గ్రామానికి చెందిన రోగప్ప అనే రైతు 52 సర్వే నెంబర్‌లో 1.25 ఎకరాలు కొని, 35 ఏళ్ల నుంచి అనుభవంలో ఉన్నారు. ఈ పొలాన్ని సర్వేయర్ రీసర్వే చేసి సర్వేయర్ ఎంజాయ్‌మెంట్ స్కెచ్ ఇచ్చారు. అదే సర్వేయర్ రోగప్ప పొలం పక్కన ఉన్న రైతుకు 'దున్నుకో, లేకుంటే పోలీసు స్టేషన్‌కు వెళ్లు. వాళ్లే నీకు సహాయం చేస్తార'ని సలహా ఇచ్చినట్లు తెలిసింది.


సర్వేయర్ ఇచ్చిన ఎంజాయ్‌మెంట్ స్కెచ్

## పాఠశాలలపై విద్యాశాఖ దాడులు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

స్థానిక గ్లోబల్, వైష్ణవి ప్రయివేటు పాఠశాలలపై మండల విద్యాధికారులు మోహనుద్దీన్, రాఘన్నలు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ రెండు పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాలు, డ్రస్‌లు అధిక ధరలకు అమ్ముతున్నారని ఓ విద్యార్థి తండ్రి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో స్పందనలో తహశీల్దార్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారు దాడులు నిర్వహించి, ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్రను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలల్లో స్కూలు ఫీజులు, పుస్తకాల అమ్మకాల రేట్లు విపరీతంగా పెంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వసూలు చేస్తున్నట్లు, విద్యను వ్యాపారంగా మార్చారని తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఓ ప్రయివేట్ గోడౌన్‌లో రూ.లక్షల విలువ చేసే నోట్ పుస్తకాలు, ప్రయివేట్ పాఠ్య పుస్తకాలు నిల్వ ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాల పై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యను వ్యాపారంగా మార్చారని, ప్రయివేట్ పాఠశాలల అనుమతులు రద్దు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలోనూ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు.

## జలజీవన్ మిషన్ కింద పైపులైన్ పనులకు భూమి పూజ

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

మండలంలోని కల్లుకుంట గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటుకు పైపులైన్ నిర్మాణానికి సర్పంచి ఇస్మాయిల్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి యువ నాయకులు ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో ప్రతి ఇంటికీ కుళాయి ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు బి.లక్ష్మన్న, షేర్‌ఖాన్, దస్తగిరి, బాషా, షర్ఫుద్దీన్, హాజీ, మలంగ్, గంగన్న, నాగరాజు ఆచారి, వడ్డీ అయ్యప్ప పాల్గొన్నారు.

### విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే

## వైసిపికి షాక్ తప్పదు...

**- ట్రూ అప్ చార్జీల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్న వైసిపి - అఖిలపక్ష పార్టీలు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

రాష్ట్రంలో ట్రూ అప్, కస్టమర్, సర్ చార్జీల పేరుతో ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న వైసిపికి రాబోయే ఎన్నికల్లో షాక్ తప్పదని అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. సోమవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు పంపన గౌడు, హనుమంతుడు, రాజు, రామాంజనేయులు, ఖదీర్, ఏసోపు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. అందులో 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని, విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడంలో దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేకపోతే మరో బషీర్ బాగ్ పోరాటాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. బాలరాజు, సమీవుల్లా, చిన్నన్న, కెసి.జబ్బార్, తిమ్మగురుడు, విజయేంద్ర, ఖాదర్, శాంతప్ప, ఖాజా, రాముడు, రాజు, లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.


విద్యుత్ ఎడికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## 'విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయండి'

**ప్రజాశక్తి - హోళగుంద**

ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక బస్టాండ్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ మాట్లాడారు. రిజర్వాయర్లు, కాలువల నిర్మాణం, పరిశ్రమల కోసం భూములు కోల్పోతున్న రైతులకు పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. 2022 ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిన్న రైతులకు పంటల బీమా, నష్టపరిహారం విడుదల చేయాలని కోరారు. గతేడాది నవంబరు, డిశంబరు, ఈఏడాది ఏప్రిల్, మేలలో వచ్చిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయా రని తెలిపారు. నకిలీ విత్తనాలు, అకాల వర్షాలతో 2022 ఖరీఫ్‌లో పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమోటా వంటి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని చెప్పారు. వారికి ఇప్పటి వరకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి ఇవ్వలేదన్నారు. ఎరువుల ధరలు నియంత్రించాలని, రైతులు పంటలకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, సీనియర్ నాయకులు కట్టప్ప, రాఘవేంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు** బస్టాండ్‌లో గోడపత్రికలు ఆవిష్కరించారు. రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈడిగ తిక్కన్న గౌడ్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్ పాల్గొన్నారు.

## పొలానికి హద్దులు చూపండి

**- బాధితురాలు రామాంజిని**

**ప్రజాశక్తి- పెద్దకడబూరు**

మండలంలోని హనుమాపురం గ్రామ శివార్లలో ఉన్న పొలానికి హద్దులు చూపాలని రామాంజిని కోరారు. సోమవారం తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హనుమాపురం గ్రామంలో సర్వే నెంబరు 1099లో 2.50 ఎకరాల భూమి ఉందని తెలిపారు. తన పొలం పక్కన ఉన్న సర్వే నెంబర్ 1090లో భూమి ఉందన్నారు. ఈనెల 10న పీర్ సాబ్ హరిశ్చంద్ర కుమారులు అందులో చెట్లు, రాళ్లు తొలగించే కార్యక్రమంలో తన పొలంలో కొంత భాగాన్ని ఆక్రమించారని తెలిపారు. తన పొలం అక్రమాలకు గురికాకుండా హద్దులు చూపాలని డిమాండ్ చేశారు.



## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**- ఇద్దరికి గాయాలు**

**ప్రజాశక్తి- దేవనకొండ**


క్షతగాత్రులను పరామర్శిస్తున్న నాయకులు

మండలంలోని ఈదులదేవరబండ గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... మద్దికెర గ్రామానికి చెందిన గొల్ల చంద్రశేఖర్, చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆయన తల్లి బజారమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మద్దికెర నుంచి టిఎస్ 07 సిఎం 3817 కారులో భార్య ప్రభావతి, అదే గ్రామానికి చెందిన వ్యక్తితో కలిసి కర్నూలుకు బయల్దేరారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ గ్రామాల మధ్యలో కారు టైరు పగిలి బోల్తా పడింది. భార్య ప్రభావతి (32) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

**క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి గుమ్మనూరు**

'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్లెల చెలిమెల్ల గ్రామానికి రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ వెళుతుండగా ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రులను ప్రయివేట్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి వారికి అండగా నిలిచిన తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్‌ను అక్కడే ఉన్న వారు అభినందించారు.

# మాదకద్రవ్యాలతో తిరోగమన దిశగా సమాజం

**- డీఎస్పీ శివ నారాయణస్వామి**

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రజలు మత్తు పదార్థాలకు అలవాటు పడితే సమాజం తిరోగమన దిశగా పయనిస్తుందని డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెబ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ రోడ్డు గుండా కొత్తబస్టాండ్, ఆర్ట్స్ కళాశాల వరకు ప్రదర్శన చేపట్టారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా ప్రిన్సిపల్ మురళీ మోహన్ రెడ్డి అధ్యక్షతన కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ఒకప్పుడు పట్టణాలు, నగరాలకే పరిమితమైన మత్తుపదార్థాల జాడ్యం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు పాకడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ధూమపానం, మద్యపానంతో సరదాగా మొదలయ్యే అలవాటు క్రమంగా మాదకద్రవ్యాల దాకా విస్తరిస్తోందన్నారు. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దలు పిల్లలను నిత్యం గమనిస్తూ వారు చెడుదారుల్లో వెళ్లకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. సెబ్ సిఐ హరికృష్ణ, సిఐలు నరసింహా రాజు, విక్రమ సింహా, శ్రీనివాస నాయక్, ట్రాఫిక్ సిఐ పార్థసారథి, వైస్ ప్రిన్సిపల్ సురేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయం**లో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో సిబ్బందితో, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పిఇటి నరసింహరాజు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు సాయి జశ్వంత్, జి.అజయ్ కుమార్, సల్మాన్ బాషకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఎమ్మిగనూరు రూరల్ సిఐ కె.మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎంఇఒ నీలకంఠ, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, సీనియర్ ఉపాధ్యాయులు విజయకుమార్, జె.ఉస్మాన్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో వైష్ణవి డిగ్రీ కళాశాలలో యూత్ మూవ్‌మెంట్, మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ బాలయ్య, సెబ్ సిఐ జయరాం నాయుడు, డాక్టర్, వైష్ణవి డిగ్రీ కళాశాల ఛైర్మన్ జీడి లింగప్ప హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి లాల్కోట్ ఖదీర్ బాషా, రాష్ట్ర మహిళా సెక్రటరీ వసుంధర దేవి, రాష్ట్ర యూత్ ప్రో ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ పరశురాం, అన్సర్ బాయ్, సమీ పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న డీఎస్పీ శివ నారాయణ స్వామి


గోనెగండ్లలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిఐ




జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్మన్ తదితరులు

# రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరు

## 30న చలో విజయవాడను విజయవంతం చేయండి : రైతు సంఘం - విస్తృతంగా ప్రచారం

**ప్రజాశక్తి - ఆత్మకూరు**

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించేటు వంటి రైతాంగ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్, మండల అధ్యక్షులు మాబాషా, కార్యదర్శి ఎన్ వీరన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న విజయ వాడలో జరిగే మహా ధర్నా జయప్రదానికై ప్రచారజాతాను పట్టణములోని ఆర్టీసీ బస్టాండ్ ముందర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దాపురం లిఫ్టిఇరిగేషన్ కింద పంట కాలువలను వెంటనే పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని, సిద్దాపురం ఎత్తిపోతల పథకం నుంచి మండలంలోని శ్రీపతిరావుపేట ఇందిరేశ్వరం వడ్ల రామాపురం కురుకుంద గ్రామాల చెరువులకు నీరు నింపాలన్నారు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలపై పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, వాణిజ్య పంటలకు రూ.25వేలు ఇవ్వాలని, హైవే రోడ్డు 167 నంద్యాల, కల్వకుర్తి రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారము నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, ఈ క్రాఫ్ కౌలుదారు పేరుతోనే చేయాలని పాడి రైతులకు ఒక లీటరుకు రూ.4 ఇవ్వాలని నకిలీ విత్తనాలు చలామణిలో రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయ భూములు వంశపార్య పరంగా సాగు చేసుకుంటున్నా రైతులకు హక్కులు కల్పించాలన్నారు. పేద సాగుదారులకు భూహక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ. రణధీర్, పాలశివుడు,, అంబయ్య, ఏ. కిరణ్, జి. నాగేశ్వరావు, సి. వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, మల్లయ్య వలి స్వాములు రాజు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు మాబాషా కార్యదర్శి వీరన్న, దాస్‌లు అన్నారు. కొత్తపల్లి, లింగాపురం, శివపురం, సింగరాజు పల్లి, ముసలమడుగు గ్రామాల్లో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 30న జరిగే మహా ధర్నా జయప్రదం చేయా లన్నారు. రైతు సంఘం నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. **మహానంది:** మహా ధర్నాలో రైతాంగం పాల్గొనాలని కోరుతూ గాజులపల్లె గ్రామంలో రైతు సంఘం నాయకులు గోడ పత్రికను విడుదల చేసి, కరపత్రల ద్వారా ప్రచార నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిటి. రామచంద్రుడు, రైతు సంఘం నాయకులు సుబ్బరాయుడు, సాయి కార్మిక సంఘం **తరువాయి.. 6లో..**


ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్

# వృత్తిలో స్థిరపడేందుకు 'లా నేస్తం' తోడ్పాటు

**జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

కొత్తగా న్యాయవాద వృత్తిలో ప్రవేశించి యువ న్యాయవాదులు వారి వృత్తిలో స్థిరపడే వరకు జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ 'వైఎస్ ఆర్ లా నేస్తం' ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ లా నేస్తం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన 2,677 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు చొప్పున ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకు రూ.25 వేలు చొప్పున న్యాయవాదుల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నగదు జమ చేశారు. ఈ కారక్రమాన్ని కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీ బుల్లా, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు యం. విజయ శేఖర్ రెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు కె. రామసుబ్బయ్య, జూనియర్ అడ్వకేట్ లు తదితరులు వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 399 యువ న్యాయవా దులకు లా నేస్తం ద్వారా ఆర్థిక సహాయాన్ని పంపిణీని నేరుగా వారి ఖాతాల్లో జమా కానున్నా యని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని యువ న్యాయ వాదులు సద్విని యోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనం తరం యువ న్యాయవా దులకు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్, కలెక్టర్ ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు.


పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**- ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

రైతుల సంక్షేమమే వైకాపా ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గంగుల ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రైతు తాను సాగుచేసిన పంటను తప్పకుండా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. పసుపు పంటకు క్వింటానికి 6,850 రూపా యల మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేస్తున్న ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి నారాయణస్వామి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరహరి, వ్యవసాయ శాఖ ఏడిఏ కొండారెడ్డి, చాగలమర్రి ఎంపిపి వీరభద్రుడు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు గంగుల విజయసింహారెడ్డి, దోర్నిపాటి రఫీ, వైఎస్సార్సీపీ నాయకులు బద్రి సుధాకర్ రెడ్డి, రంగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి

**- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్**

**ప్రజాశక్తి - నంద్యాల, కలెక్టరేట్**

జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను నాణ్యతతో ప్రజలలో సంతృప్తి స్థాయి పెరిగేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి, డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వీసెస్‌కు సంబంధించిన సర్వే మంగళవారం మధ్యాహ్నం లోగా పూర్తి చేయాలని సంబంధిత ఎంపిడిఓలను ఆదేశించారు. సర్వేలో వచ్చిన సర్వీస్ రిక్వెస్ట్ లు పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ వేర్వేరు లాగిన్ లలో నమోదై సర్వీస్ టోకెన్ జెనరేట్ ఏరోజుకారోజు అప్లోడ్ చేసి వారం రోజుల్లో విచారించి సంబంధిత సర్వీస్ రిక్వెస్ట్‌ల ధృవ పత్రాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధికారులను నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లుగా నియామకం చేశామని మండలాలలో జరుగుతున్న ఈ కార్యక్రమం అమలుపై ఎప్పటిక ప్పుడు పర్యవేక్షణ చేసి వందశాతం సర్వీస్ రిక్వెస్ట్‌లు అప్లోడ్ జరిగేలా చూడాలని కలెక్టరు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. స్పందనలో అధికశాతం సివిల్ తగదాలు వచ్చాయి. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


స్పందన లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం


అవగాహన ర్యాలీలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాలను డ్రగ్స్ లేని జిల్లాగా మార్చడమే ధ్యేయంగా కృషి చేద్దామని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడు యువతకు పిలుపు నిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మున్సిపల్ ఆఫీస్ నుండి శ్రీనివాస సెంటర్ వరకు సెబ్ పోలీసులు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకట రాముడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సంజీవనగర్ గేట్ మీదుగా శ్రీనివాస సెంటర్ వరకు నిర్వహించారు. అక్కడ మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రతిజ్ఞ చేయించారు. నంద్యాల టౌన్ డిఎస్‌పి సి.మహేశ్వర్ రెడ్డి, సెబ్ డిఎస్‌పి శ్రీధర్ రావు, సీఐలు ప్రభాకర్ రెడ్డి,నరసింహులు, రామకృష్ణ, రవీంద్ర పాల్గొన్నారు.

**జిల్లా వ్యాప్తంగా...** మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. **డోన్** పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ హాజరై మాట్లాడారు. **ఆత్మకూరు** పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక గౌడ్ సెంటర్లో మానవహారం నిర్వహిం చారు. డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాలు స్వీకరించడం వల్ల మనిషి విచక్షణ కోల్పోయేలా చేస్తాయని తద్వారా అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయన్నారు. సెబ్ సీఐ నాయుడు, ఆత్మకూరు ఎస్సై కృష్ణమూర్తి, కొత్తపల్లి ఎస్సై హుస్సేన్ భాష, పాములపాడు ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ** పట్టణ పోలీస్ స్టేషన్ నుండి నాలుగురోడ్ల కూడలి వరకు మాదక ద్రవ్యాలు వద్దు - ఉజ్వల భవిషత్యు ముద్దు అంటూ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై వెంకటరెడ్డి మాట్లాడారు. సెబ్ సీఐ చంద్రమణి, ప్రైవేట్ పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం** కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై శరత్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం దస్తగిరి రెడ్డి, ఏఎస్ఐ బాలన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **సంజామల :** డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ఏఎస్ఐ నాగరాజు అన్నారు. సంజామల ఎస్ఐ ప్రతాప్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో **తరువాయి.. 6లో..**

## జిల్లాలో మోస్తారు వర్షం

**- సగటు వర్షపాతం 7.4 మి. మీటర్లు**
**- అత్యధికం మిడ్తూరు 22.4 మి మీ**
**- అత్యల్పం గడివేముల 1.0 మి మీ**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జిల్లాలో 5 మండలాలు మినహా అన్ని మండలాల్లో వర్షం పడింది. ఆదివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా దాదాపు 24 మండలాల్లో వర్షం పడగా, శ్రీశైలం, చాగలమర్రి, సిరివెళ్ల, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ 5 మండ లాల్లో వర్షం పడలేదు. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 7.4 మి. మీటర్లు నమోదు కాగా అత్యధికముగా మిడ్తూరు 22.4 మి.మీ. నమోదు కాగా అత్యల్పంగా గడివేముల 1.0 మి.మీ. నమోదయింది. అలాగే ఆత్మకూరు 19.2 మి.మీ., డోన్ 17.6 మి.మీ., పాణ్యం 16.2 మి.మీ., ప్యాపిలీ 15.4 మి.మీ., నందికొట్కూరు 14.2 మి.మీ., జూపాడు బంగ్లా 13.8 మి.మీ., అవుకు 13.6 మి.మీ., నంద్యాల 12.2 మి.మీ., కోవెలకుంట్ల, పాములపాడు 8.8 మి.మీ., బేతంచెర్ల 8.2 మి.మీ., సంజామల 8.0 మి.మీ., బనగానపల్లె, మహానంది 7.8 మి.మీ., బండి ఆత్మకూరు, కొలిమిగుండ్ల 3.0 మి.మీ., కొత్తపల్లె, దొర్నిపాడు మండలాల్లో 2.8 మి.మీ., గోస్పాడు 2.6 మి.మీ., పగిడ్యాల, రుద్రవరం మండలాల్లో 1.8 మి.మీ., వెలుగోడు 1.2 మి.మీ., గడివేముల 1.0 మి.మీ. వర్ష పాతం నమోదైనట్లు జిల్లా అధికార వర్గాలు వెల్లడించాయి.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

## పోలీసు స్పందనకు 110 ఫిర్యాదులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 110 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కువగా సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి. ఫిర్యాదిదారులకు ఓంకారం దేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడు , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జె వి సంతోష్ , సీఐ దస్తగిరి బాబు పాల్గొన్నారు.

## పండ్ల మొక్కలను పెంచండి : ఎపిడి

**ప్రజాశక్తి - మిడుతూరు**

రైతులు పండ్ల తోటలను పెంచాలని ఎపిడి బాలాజీ నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని చౌట్కూరు బన్నూరు తదిత గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వివిధ రకాల పండ్ల తోటలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం 100% సబ్సిడీతో పండ్ల మొక్కలను అందిస్తుందని ఆయన అన్నారు. అలాగే కంప్యూటర్లోని ఎఫ్ఏ లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జయంతి సూర్య నరేష్ ఏసీలు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - పాములపాడు**

మండ లంలోని మద్దూరు మజార గ్రామం పెంచికల పల్లె గ్రామంలో స్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, బీసీ సంఘాల నాయకులు అబ్రహాము, నాగరాజు, మారెన్న, ప్రభాకర్, అంకన్న, శ్రీనివాసులు మాట్లా డుతూ పెంచికల పల్లె గ్రామంలో దళితుల స్మశాన వాటికను గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తాసిల్దార్ రత్న రాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. సర్వేలతో కొలతలు కొలిపిస్తామని రికార్డులను పరిశీలించి తగు న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## పాత సిద్దేశ్వరంలో పెద్దపులి సంచారం

**- కోడెదూడ మృతి**
**- భయాందోళనలో గ్రామస్తులు**

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

పెద్దపులి సంచారంతో మండలంలోని పాత సిద్దేశ్వరంలో ఆ గ్రామ వాసులను భయాందోళనకు గురి చేసింది. సోమవారం వేకు జామున పశువుల నారాయణ అనే వ్యక్తి కోడెదూడపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. గ్రామస్తులు స్థానిక ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావుకు సమాచారం తెలియడంతో ఫారెస్ట్ అధికారి ఫారెస్ట్ బృందంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఆత్మకూర్ డీఎఫ్ఓ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఎఫ్ఆర్ఓ పట్టాభి ఎఫ్ ఆర్ ఓ యాంటీ కోచింగ్ స్క్వాడ్ సుభాష్ ఆధ్వర్యంలో పాత సిద్దేశ్వరం పరిసర ప్రాంతంలో తిరిగి పాదముద్రలు గుర్తించి పెద్దపులి పాదముద్రలని గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పాదముద్రలు ఎక్కడెక్కడ ఉన్నాయని సమీప పరిసర ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పెద్దపులిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక కెమెరా ట్రాప్‌లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పెద్దపులి దాడిలో చనిపోయిన కోడెదూడ యజమా నుదారునికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చే విధంగా ప్రత్యేక కృషి చేస్తామన్నారు. రాత్రి సమయంలో గ్రామంలోకి పెద్దపులి రాకుండా ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి పలు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులందరూ ఆందోళన చెందకుండా పెద్దపులి దొరికేంతవరకు ఫారెస్ట్ అధికారులకు సహకరించి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చనిపోయిన కోడెదూడకు పశువైద్యాధి కారి భువనేశ్వరి ఆధ్వర్యంలో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఫారెస్ట్ సిబ్బంది పాములేటి పలువురు ఫారెస్ట్ సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.


మృతి చెందిన కోడెదూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ బృందం

## పేదల పక్షపాతి సిఎం జగన్ : ఎమ్మెల్యే


పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

పేద, బడుగు, బలహీన ప్రజల పక్షపాతి సిఎం జగన్ అని శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో నూరవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జడ్పి చైర్మన్ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం బనగానపల్లె నియోజకవర్గం లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి,నంద్యాల జిల్లా వైఎస్ఆర్ పార్టీ ప్రచార అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, కొలిమిగుండ్ల మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పులి ప్రకాశ్ రెడ్డి, కోటపాడు గ్రామ ఎంపీటీసీ కళావతి, సర్పంచ్ సుంకమ్మ,సింగిల్ విండో చైర్మన్, గ్రామ సచివాలయ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి, మూల వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంలో ఇన్నర్ వీల్ క్లబ్

**ప్రజాశక్తి-డోన్**

సమాజంలో సేవా దృక్పథంతో ఇన్నర్ వీల్ క్లబ్ సేవలందిస్తుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ.శాంతి అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీకి చెందిన విజయశాంతి కి లివర్ చెడిపోయిందని,తనకు ఆరోగ్య రీత్యా ఖర్చులకు గాను హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఎస్.సాయిరాజ్,ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు శకుంతల, ఝాన్సీల ఆర్థిక సౌజన్యంతో 6000 రూపా యలను అందజేశామని,అలాగే టీచర్స్ కాలనీకి చెందిన నిరుపేద బ్రాహ్మణ విద్యార్థి అయ్యర్ అక్షిత్‌కు ఒక అజ్ఞాత దాత సహకారంతో 5000 రూపాయలు ను అందించినట్లు క్లబ్ అధ్యక్షురాలు శాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో చేసే పనిలో సార్థకత ఉండాలని అన్నారు. చేసే సహాయం చిన్నదైనా గుర్తుండిపోయేలా ఉంటుందన్నారు. సమాజంలో ఉపయోగపడే ప్రతి పనిని ఒక సంకల్పంతో ముందుకు తీసుకువెళ్లాలన్నారు. బాధితులకు భరోసా నిచ్చి అండగా నిలవాలని అన్నారు. అనంతరం సహాయం అందించిన దాతలకు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రాజా సుజాత,మర్రి సరళదేవి, అనురాధ, సరోజమ్మ, సుధాబట్టు,విజయ లక్ష్మి, రాజకుమారి, ఉమా, కె.పద్మ,షాలిని తదితరులు పాల్గొన్నారు.



లివర్ బాధితురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

## వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - నంద్యాల రూరల్**

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వికలాంగులకు 40016ల వరకు పెన్షన్ పెంచారని ఎపిలోనూ పెంచాలన్నారు. అనంతరం డిఆర్ఓ పుల్లయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కిరణ్ కుమార్, ఎల్లయ్య, భాష, సలహాదారుడు నబి రసూల్, జీవనజ్యోతి వికలాంగుల సంఘం ఆత్మకూరు అధ్యక్షులు వేణుగోపాల్ శ్రీనివాసులు, చెన్నయ్య జిలాని తదితరులు పాల్గొన్నారు.


డిఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్‌కు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఏపీ నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం యూనిటీ హెడ్, సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.వి. ప్రతాపరెడ్డిలు సోమవారం తెలిపారు. ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రంలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్స్ కు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదివి 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలలోపు వారికి మూడు నెలలు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు చూపించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 9705998056, 8465925341 లకు సంప్రదించాలని వారు తెలిపారు.


మాట్లాడుతున్న భూసర్వే ప్రత్యేక అధికారి

## సమగ్ర భూ సర్వేకు సహకరించండి

**- భూసర్వే ప్రత్యేక అధికారి**

**ప్రజాశక్తి - మహానంది**

మండలంలోని గ్రామాల్లో జరిగే సమగ్ర భూ సర్వేకు రైతులు సహకరించాలని భూ సర్వే ప్రత్యేక డిప్యూటీ తహసిల్దార్ కామేశ్వర్ రెడ్డి రైతులను కోరారు. సోమవారం మండలంలోని బొల్లవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినభూసర్వే రైతులకుఎంతోఉపయోగపడుతుందని ఇలాంటి సువర్ణ అవకాశాన్ని రైతులు జారవిడుచుకోవద్దని కోరారు. ఫిర్యాదులు ఉంటే గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, పరిధిలో పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణకు అవకాశం ఉంటుందన్నారు. అపోహలు వీడి రైతులు సహకరించాలని భూ సర్వే స్పెషల్ డిప్యూటీ తాసిల్దార్ కామేశ్వర్ రెడ్డి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జమాల్, బి వీఆర్వో చలమయ్య, పంచాయతీ కార్యదర్శి సుమాంజలి, సర్వేయర్లు పవన్, శ్రీధర్ రైతులు పాల్గొన్నారు.

## మాకూ.. ఇంటి పట్టాలు ఇవ్వాలి

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

అనుభవంలో ఉన్న ఇంటి స్థలాలను తొలగించి జగనన్న కాలనీ కోసం కొత్తవారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, వారితోపాటు అనుభవంలో ఉన్న తమకు ఇంటి పట్టాలు ఇవ్వాలని మండలంలోని రామపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు వారు డిప్యూటీ తాసిల్దార్ హరితను కలిసి సమస్యను వివరించారు. డిప్యూటీ తాసిల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారికి మాత్రమే ఇంటి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

**ప్రజాశక్తి - వెలుగోడు**

వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో నాబార్డ్ నిధులతో మంజూరైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. సోమవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సత్య నారాయణ హెగ్డే మాట్లాడుతూ రూ 80 వేలతో పూర్వ విద్యార్థుల సంఘంచే నిర్మించబడిందని ఎమ్మెల్యేకు వివరించారు. అదేవిధంగా పాఠశాలకు గదులకు పెయింటింగ్, శిథిలావస్థకు చేరుకున్న సభాస్థలి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులను మంజూరు చేయిం చాలని కోరారు. అనంతరం విద్యాభివృద్ధికి పాఠశాల మౌలిక వసతుల కోసం పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న కృషి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ రమేష్, వెలుగోడు సర్పంచ్ జైపాల్, షంషీర్ అలీ, ముంతల విజయ భాస్కర్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్చయ్య, టౌన్ ప్రెసిడెంట్ ఇలియాస్ ఖాన్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు జయరామిరెడ్డి మక్బుల్ బాష, సుల్తాన్, మొహిద్దిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న ఐఎఫ్టియు నాయకులు

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి : ఐఎఫ్‌టియు

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు**

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం పేర్కొన్నారు. సోమవారం నాడు శ్రీశైలం మండలం సుండిపెంటలో మండల తాసిల్దార్ బి.రాజేంద్ర సింగ్‌కు తోటమాలీల కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్పందన కార్యక్రమంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీశైలం దేవ స్థానం పరిధిలో కార్తికేయ ఏజెన్సీ క్రింద దాదాపు 150 మంది తోటమాలి కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని వీరికి నెలకు కేవలం రూ.8 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, అది కూడా సక్రమంగా చెల్లించడం లేదని అడిగితే కార్మికులను బలవంతంగా పనుల నుండి తొలగిస్తున్నారని అన్నారు. జీతాలు పెంచుటకై దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్, దేవాదాయ శాఖ మంత్రి,ఈవోలకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం స్పందన లేదన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి నెలకు రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించి పిఎఫ్, ఈపీఎఫ్ అందరికీ వర్తించేలా చూడాలని కోరారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి

**- జడ్పీటీసీ లక్ష్మి దేవి**

**ప్రజాశక్తి - చాగలమర్రి**

గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిం చుటకు తమ వంతు కృషి చేయాలని జెడ్పిటిసి లక్ష్మీదేవి, వైఎస్ఆర్ కాంగ్రెస్ మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం చాగలమర్రి మండలం శెట్టివీడు సచివాలయాన్ని తనిఖీ చేసి గ్రామ ప్రజలతో సమావే శమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, పింఛన్ సమ స్యలు వారి దృష్టికి రాగా వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు అన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న జడ్‌పిటిసి

**రామ్ నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ**

శెట్టి వీడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వైసిపి నాయకుడు రామ్ నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులను జడ్పిటిసి లక్ష్మీదేవి, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి పరామర్శించారు. అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రామ్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులే గ్రామంలో వైసీపీ తరఫున నాయకత్వం వహిస్తారని తెలిపారు.

## జలదుర్గం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి -ప్యాపిలి**



జలదుర్గం కొత్త సబ్ ఇన్స్పెక్టర్‌గా సోమవారం నాడు విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నరేష్ నంద్యాల విఆర్‌కు వెళ్లారు. బదిలీలో భాగంగా హాలహర్వి పోలీస్ స్టేషన్ నుంచి జలదుర్గం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. జలదుర్గం పరిసర ప్రాంతాలలో నాటుసారా, మట్కా, అసాంగిక కార్యక్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తామ న్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

## జీవన్‌జ్యోతి హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం**

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నందికొట్కూరు పట్టణంలోని జీవన్‌జ్యోతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యాలయాలను వెంటనే స్కూలు గుర్తింపును రద్దు చేయాలి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు చింతకుంట కురుమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కుమార్ పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ అధిక ఫీజులను వసూలు చేస్తున్న జీవనజ్యోతి పాఠశాల గుర్తింపుని రద్దు చేయాలని డిఇఒను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సిడి ఆంజనేయులు, నాగరాజు, గోవిందా ఆచారి నరసింహ, కుమార స్వామి, మద్దిలేటి, రాజగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిలో ఉద్యోగాలు కల్పించండి

**ప్రజాశక్తి - నంద్యాల**

ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటిస్‌గా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తమను వెంటనే ఏపీఎస్ఆర్టీసీలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని అప్రెంటిస్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు సోమవారం నాడు కలెక్టర్‌కు, ఆర్ఎంఓకు వినతి పత్రం అందజేశారు. అప్రెంటిస్ పూర్తి చేసి తమకు డిపోలలో ఖాళీగా ఉన్న పోస్టులు మంజూరు చేయాలని కోరారు. సురేంద్రబాబు,అనిల్ ,అంజి,హనీఫ్, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మరింత అభివృద్ధికి కృషి

**- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి**

**ప్రజాశక్తి - ఆత్మకూర్**



పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మరింత అభివృద్ధి చెందే విధంగా నూతన పాలక మండలి సభ్యులు సమిష్టిగా పని చేయాలని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు.

సోమవారం నాడు ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ కమిటీ పాలకమండలి చైర్మన్గా బాలస్వామి, వైస్ చైర్మన్‌గా రషీద్ అబ్దుల్, డైరెక్టర్లుగా రేగటి బలరాంరెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నాగ పుల్లయ్య, పద్మావతమ్మ, శిరోమణి ఆదిలక్ష్మి, సుధాకర్, రామసుబ్బమ్మ, మౌనిక, నాగ వెంకట రమణి, వెంకటసుబ్బయ్య, ఉషారాణి, విక్రమ్ సింగ్ నాయక్ తదితరులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు 60 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి మొట్టమొదటిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన బాలస్వామి యాదవ్‌కు దక్కడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు చైర్మన్ డాక్టర్ ఆసియా, జడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**ప్రజాశక్తి-డోన్**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీ కాంత రెడ్డిలు అన్నారు. సోమవారం డోన్ పట్టణం లోని పాతపేట నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు క్రమశిక్షణగా పంపాలని కోరారు. ఎప్పటికప్పుడు విద్యార్థులను గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు విద్య మీద ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు అనేక విద్యా సంబంధిత కార్యక్ర మాలు ఏర్పాటు చేసి, విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తి పెరిగేలా చేస్తుం దన్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా ప్రతి ఒక్కరికి స్కూల్ బ్యాగ్, యూని ఫాం, బెల్ట్,షఉస్, సాక్స్,నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్ అందిస్తుందని తెలిపారు. జగనన్న ఆణిముత్యాల క్రింద పాఠశాల, కళాశాల యందు, నియోజ కవర్గంలో జిల్లా యందు రాష్ట్ర స్థాయి నందు ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి ఒక వెయ్యి నుంచి మొదలు ఒక లక్ష రూపాయలు బహుమతిగా అందించారని తెలిపారు. అంతే కాదు విద్యార్థుల తల్లిదం డ్రులకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు,కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం చేస్తారని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకట రమణ, సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకటలక్ష్మీ, లక్ష్మయ్య, బాబు,అనంత శ్రీనివాసులు,జయ సుబ్బారాయుడు, మధుసూదన్ రెడ్డి, సుబ్బ రాయుడు, శ్రీనివాసులు,సంజీవరెడ్డి , రమేష్,దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి, భారతి, లీలావతమ్మ,రాధ,అల్లిపిర,రఘు నాథ్,ఎస్తేరమ్మ, సురేష్, ఆదినా రాయణ, సుబాన్,లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను,ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు ఎం వెంకటసుబ్బారెడ్డి

# రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరు

**5వ పేజీ తరువాయి..**

మండల కార్యదర్శి కోటకొండ బాష, రమణ, సిపిఎం నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

**పాములపాడు:** రైతాంగం సమస్యల పైన ఈనెల 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకులు యాదాటి నాగేంద్రుడు, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి హనుమంతు, నాయకులు రంగస్వామి, శీను కోరారు. సోమవారం వారు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ దేశంలో రాష్ట్రంలో రైతాంగానికి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని బావులకు బోర్లకు మీటర్లు బిగించకూడదని రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయాలని గతేడాది పండించిన ఖరీఫ్, రబీ సీజన్లో నష్టపోయిన రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ పంటల బీమా వెంటనే విడుదల చేయాలని, తదితర సమస్యలపై మహాధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు





పాములపాడులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

## ప్రభుత్వ పథకాలపై సర్వే వేగవంతం

**ప్రజాశక్తి - పాములపాడు**

గ్రామాలలో జూలై 1 నుండి జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలను వివిధ రకాల ధృవపత్రాలపై సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో గోపికృష్ణ ఆదేశించారు. సోమవారం పాములపాడు సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష ఉద్దేశం అన్నారు. ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడేలా బోధించాలని మండల విద్యాధికారులు శ్రీరాములు ఇనాయతులా తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న ఎంఆర్సి భవనంలో మండలంలో ఉన్న పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల చదువును బట్టి అర్థమయ్యే రీతిలో విద్యను అందించాలన్నారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను బట్టి బోధించాలి అన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన

**ప్రజాశక్తి - పగిడ్యాల**

కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వైద్య అధికారి డాక్టర్ మోహన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి జూలై నెల 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కుష్టి వ్యాధి లక్షణాలు వాటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్నప్పుడు స్థానిక వైద్యశాలను గాని ఆరోగ్య కార్యకర్తలని సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలన్నారు. సిహెచ్ఓ రామగురప్ప ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా సుభద్రమ్మ

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రి మండల నూతన తహసిల్దార్‌గా సుభద్రమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పగిడ్యాల మండల డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న సుభద్రమ్మ పదోన్నతి పొంది తహసీల్దారుగా చాగలమర్రిలో బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు,రైతులకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## సోనియా గాంధీని కించపరిస్తే సహించం

**- ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు**

**ప్రజాశక్తి - నంద్యాల**

సోనియా గాంధీని కించపరిస్తే సహించం అని ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు అన్నారు. సోమవారం నాడు నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. ఏపీ రాజకీయాలే లక్ష్యంగా రెండు భాగాలుగా రూపొందుతున్న 'వ్యూహం' సినిమా టీజర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఈ సినిమాలో సోనియా గాంధీని కించపరిచేవిధంగా రూపొందిస్తే ఊరుకోబోమని రామ్ గోపాల్ వర్మకు కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. గాంధీ, నెహ్రూల కుటుం బాన్ని విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, జిల్లా కోశాధికారి ఎస్ వై డి ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు ఆనందరావు, బండి ఆత్మకూర్ మండల అధ్యక్షుడు జజ్జర రవిబాబు, ఈశ్వర్, మైనారిటీ సీనియర్ నాయకులు పాల మాబుసా, పెద్దన్న తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యూహం సినిమా టీజర్ పై మండిపడ్డ ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య

## ఈద్గాలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

**- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్**

**ప్రజాశక్తి-డోన్**



ఈద్గా ఆవరణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఈద్గాలో కావాల్సిన అన్ని సౌకర్యాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. సోమవారం డోన్ పట్టణం లోని చిగురుమాను పేటలో ఉన్న ఈద్గా దగ్గర సామూహిక నమాజ్ కొరకు ఏర్పాట్లను డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా మైదానంలో క్లీనింగ్,వాటర్,లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఈద్గా లో మున్సిపాలిటీ నుంచి అన్ని సహాయ సహకారాలు అందించినందుకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్,కౌన్సిలర్ నాగేంద్ర,పెయింటర్ మాబు,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం

**5వ పేజీ తరువాయి..** మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని కళాశాల, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**మహానంది:** ఎస్సై నాగేంద్రప్రసాద్ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**చాగలమర్రి:** విద్యార్థులు,యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రమణయ్య కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో హెచ్ఎం కోటయ్య అధ్యక్షతన మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. పాఠశాల నుండి పెద్దమకానం మీదుగా గాంధీ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది,విద్యార్థులు,జిఎంఎస్‌కెలు పాల్గొన్నారు.












నాయకులతో మాట్లాడుతున్న బీసీ జనార్దన్ రెడ్డి

## టిడిపి నేతలకు బీసీ పరామర్శ

**ప్రజాశక్తి - కోవెలకుంట్ల**

మండలంలోని గుంజలపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులను సోమవారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. గ్రామంలో ముక్క మల్ల రామ సుబ్బారెడ్డి కి గుండెకు శస్త్ర చికిత్స చేయడంతో ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న బిసి జనార్దన్ రెడ్డి ఆయన ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన గాలి పుల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటు ండగా ఈ విషయం తెలుసుకొని బీసీ జనార్దన్ రెడ్డి వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - వెలుగోడు**

డబ్బు కళాకారులకు రూ. 5 వేలు పెన్షన్ మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైసీ ప్రభుత్వం దాదాపు హామీ ఇచ్చిన వారందరికి పెన్షన్లను పెంచిందన్నారు. అదేవిధంగా డప్పు కళాకారులకు కూడా పెన్షన్ మంజూరు చేయాలని వారు కోరారు. సిఐటియు కార్యాలయం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామన్న, దరగయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక విద్యాపీఠం పదవతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల భాగంగా సోమవారం జిల్లా ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించారు. నంద్యాల జిల్లాలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి 3 పరీక్షా కేంద్రాలలో 273 మంది విద్యార్థులకు గాను 246 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఓపెన్ స్కూల్ ఇంటర్ 3 పరీక్షా కేంద్రాలలో 266 మంది విద్యార్థులకు గాను 234 విద్యార్థులు హాజరయ్యారు.27 మంది పదవ తరగతి విద్యార్థులు, 32 మంది ఇంటర్ విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె. సుధాకర్ రెడ్డి తెలిపారు.ఫ్లయింగ్ స్క్వాడ్లు 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



నీటి ముంపు నిర్వాసితులతో విచారిస్తున్న అధికారులు

## నీటి ముంపు నిర్వాసితుల జాబితాపై విచారణ

**ప్రజాశక్తి - పగిడ్యాల**

శ్రీశైలం ప్రాజెక్టు నీటి ముంపు నిర్వాసితుల జాబితాపై విచారణ చేపట్టినట్టు హెచ్ఎన్ఎస్ 4 శుభాకాంక్షలు డిప్యూటీ తాసిల్దార్ శ్రీ రాధా, విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితుల జాబితాపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్పెషల్ కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్లో ఉన్న శ్రీశైలం నీటిముంపు నిర్వాసితుల జాబితాను విచారిస్తు న్నట్లు వారు తెలిపారు. అవార్డులు ఉన్నవారికి నోటీసులు ఇచ్చామని వారు లేనియెడల వారి వారసులను విచారణ చేపట్టినట్లు వారు తెలిపారు. మండల పరిధిలో బీరవోలు గ్రామానికి చెందిన శ్రీశైలం నీటి ముంపు నిర్వాసిత బాధ్యతలు 529 మంది పెండింగ్లో ఉన్నారన్నారు. రూ 12 కోట్లు లోకదాలత్ జడ్జి వద్ద ఈ అమౌంట్ ఉందన్నారు. వీళ్లను పూర్తిగా విచారించి ప్రత్యేక కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. కమిటీ ద్వారా మరల విచారించి విచారించిన లిస్టును లో కథల జడ్జికి అందజేయడం జరుగుతు ందన్నారు. లోకదాలత్‌లో కమిటీతో పరిశీలించడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం వారికి చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో దాదాపు 33 గ్రామాల లో 4583 మంది పెండింగ్లో ఉండగా వెయ్యి మందిని విచారించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు రాధమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో చోరి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రి పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న చెన్నయ్య ఇంట్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరికి పాల్పడినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు బాధితుడు చెన్నయ్య ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్ళి ఆదివారం తిరిగి వచ్చి చూడగా తాళాలు పగుల గొట్టి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ఇంట్లోని బీరువా పగుల గొట్టి అందులోని రూ. 60 వేలు విలువ చేసే 2 తులాల కమ్మలు,నాలుగు ఉంగరాలు చోరికి గురైందని బాధితుడు పిర్యాదు చేసారు. సోమవారం క్లూస్ టీం వచ్చి చోరి ప్రాంతంలోపలు నమునాలు సేకరించినట్లు ఎస్ఐ వివరించారు.

## మంత్రి బుగ్గనకు అండగా ఉండాలి

**- వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ టిఇ దినేష్ గౌడ్**

**ప్రజాశక్తి-డోన్**

డోన్‌ను అభివృద్ధి చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని వచ్చే ఎన్నికలలో గెలిపించేందుకు అండగా ఉండాలని డోన్ నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ టిఇ దినేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని 20,21 వార్డులలో డోన్ నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్ అభివృద్ధి ప్రధాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని వచ్చే ఎన్నికలలో అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. డోన్ నియోజకవర్గంలో 330 కోట్లతో వాటర్ గ్రిడ్ ద్వారా ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు కృషి చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వైసీపీ సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాదిక్,మల్యాల సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, పట్టణ కన్వీనర్ మహేంద్రనాయుడు, కో కన్వీనర్లు ముస్తాక్, వెంకటేష్,మసిమద్దయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ టిఇ దినేష్ గౌడ్